క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



పొన్నలూరులో కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై అనూక్

పొన్నలూరు: వాహనదారులు నిబంధనలు అతిక్రమించి నడిపితే చర్యలు తప్పవని ఎస్సై కె అనూక్ హెచ్చరించారు. రహదారి భద్రతలో భాగంగా పొన్నలూరులో ఆదివారం ఆటోలు, ట్రాక్టర్లు ఇతర వాహన డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. కట్టెలు, పొగాకు చెక్కల లోడుతో వెళ్లే ట్రాక్టర్లు సైడ్ డోర్లు తీసి వెళ్లడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నిబంధనలు పాటించి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు.

వైభవంగా పోలేరమ్మతల్లి వార్షికోత్సవం



గుడి చుట్టూ ప్రదర్శనలో పాల్గొన్న భక్తులు

కొండపి: మండలంలో కొండపి పంచాయతీ కట్టవారిపాలెంలో ఆదివారం పోలేరమ్మ తల్లి 12వ వార్షిక వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక స్వామి, నాంచారమ్మ, దేవత సమేత అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత గ్రామస్తులు అమ్మవారికి సద్ది, పసుపు నీరు తీసుకొని ఊరేగింపుగా గుడి దగ్గరకు వచ్చి సమర్పించారు. కట్టవారిపాలెం గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవారిని పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. అనంతరం 2 వేల మందికి అన్నదానం చేశారు.

వైభవంగా ముగిసిన గంగమ్మతల్లి తిరునాళ్లు



గంగమ్మతల్లి ఆలయ పూజల్లో పాల్గొన్న నాయకులు, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): గంగమ్మతల్లి వార్షిక తిరునాళ్ల ఆదివారంతో ఘనంగా ముగిసింది. ఈసందర్భంగా అర్చకులు గంగమ్మతల్లి మూలవి గ్రహమూర్తికి, ఉత్సవమూర్తికి, బొల్లావులకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి మూల విగ్రహమూర్తి, బొల్లావులకు గ్రామోత్సవం నిర్వహించారు. తిరునాళ్ల ముగింపు సందర్భంగా భక్తులు బండ్లు పొంగళ్లతో ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో తీర్చిదిద్దారు. తిరునాళ్ల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పూజల్లో జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు, మేకల బాలు యాదవ్, పీరయ్యనాయుడు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహానివేదన, అభిషేకం



అభిషేక పూజలో పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన, అభిషేకం అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి మూలవిగ్రహమూర్తికి పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం గోవుకు శాస్త్రోక్తంగా అర్చకులు గోపూజ నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ మహా నైవేద్యంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. స్వామి ఉత్సవమూర్తికి అభిషేకం చేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సింగరాయకొండ: మండలంలోని పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహితులు గత స్మృతులు నెమరేసుకుంటూ వారి వారి యోగా క్షేమాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. వీరంతా ప్రతి నెల ఎవరి స్థాయిలో వారు ఆర్థిక సహాయం చేస్తూ ఒక సహాయ నిధిని తయారు చేసి తమ స్నేహితుల్లో ఎవరికి ఆపద వచ్చినా సహకారం అందించాలని, విపత్తుల్లో పేదలకు సహాయ సహకారాలు అందించేలా కృషి చేయాలని తీర్మానించారు.

- ఎంపీటీసీలకు అందని గౌరవ వేతనం
- సర్వసభ్య సమావేశాలకే పరిమితం
- సమస్యలు విన్నవిస్తున్నా పట్టించుకోని అధికారులు
- ప్రభుత్వ కార్యక్రమాలకు సమాచారం ఇవ్వడం లేదని ఎంపీటీసీల ఆవేదన

గౌరవం లేదు.. వేతనం రాదు..

కనిగిరిరూరల్:

రాష్ట్రంలో కూటమి సర్కార్ ఏర్పడి ఏడాది కావస్తోంది. ఎన్నికల హామీలను గాలికి వదిలిన ప్రభుత్వం కనీసం పాలన వ్యవహారాల్లో సైతం ఇష్టానురీతిగా వ్యవహరిస్తూ.. కుప్పిగంతులు వేస్తోంది. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను విస్మరిస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రజల నుంచి ఎంపికైన ప్రజాప్రతినిధులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యులను చేయకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంత వరకు గౌరవవేతనం కూడా మంజూరు చేయలేదు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యం ఇవ్వకుండా టీడీపీ నాయకులకు ప్రాధాన్యత ఇస్తున్నారంటూ పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మండల పరిషత్ కార్యాలయం

అందని గౌరవ వేతనాలు:

కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 75 మంది ఎంపీటీసీలు ఉన్నారు. వారికి ప్రతినెలా రూ.3వేల గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండు విడతల్లో గౌరవ వేతనం చెల్లించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గత ప్రభుత్వం ఎంపీటీసీలకు చెల్లించలేకపోయింది. 2024 జూలై 30న కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుతీరింది. ప్రస్తుతం వేతనాలు ఇప్పటి వరకు ఇవ్వలేదు. ప్రస్తుత అధికారంలో ఉన్న కూటమి సర్కార్ వీటిపై కనీస దృష్టి సారించలేదు. కూటమి సర్కారు వచ్చిన తర్వాత ఇప్పటికి రెండు సార్లు బడ్జెట్ కేటాయింపులు జరిగినా.. ప్రజాప్రతినిధుల ఖాతాల్లో నగదు జమ కాలేదు. పలు మండలాల్లో రెండు సార్లు నిధులు ల్యాప్స్ అయినట్లు సమాచారం. ఏది ఏమైనా ఎంపీటీసీలకు గౌరవ వేతనం అందని ద్రాక్షలా మారింది.

సర్వసభ్య సమావేశాలకే పరిమితం..

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సర్వసభ్య సమావేశాలకు హాజరుకావడం మినహా ప్రజా సమస్యలు పరిష్కరించే పరిస్థితి లేదని పలువురు ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాదేశికాల్లోని, గ్రామాల్లోని, వార్డుల్లోని సమస్యను ఏదైనా తీసుకొచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. కనీసం ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించకపోవడం దారుణమని, నిధుల మంజూరుపై, అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపుపై కనీసం సమాచారం ఇవ్వకుండా వివక్షత చూపుతున్నారని తీవ్రంగా మండిపడుతున్నారు.

కనిగిరి నియోజకవర్గంలో ఎంపీటీసీలు, సర్పంచులు

మండలం	ఎంపీటీసీల సంఖ్య	సర్పంచ్‌ల సంఖ్య
కనిగిరి	14	25
పామూరు	18	25
సీఎస్‌పురం	13	23
హెచ్‌ఎంపాడు	9	23
పీసీపల్లి	11	18
వెలిగండ్ల	10	21
మొత్తం	75	135

సమావేశాలకు హాజరై మమ అనే విధంగా టీ బిస్కెట్‌లు తిని వెళ్లాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

పొన్నలూరు: వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం స్థానిక విప్పగుంట రోడ్డులో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పొగాకు రైతుల పట్ల కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తూ మాజీ సీఎం జగన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న బుధవారం పొదిలి పొగాకు బోర్డు వద్ద ఆందోళన కార్యక్రమం చేపడుతున్న నేపథ్యంలో సమాయుక్త సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పీసీపల్లి: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం మండల కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ కన్వీనర్ గోపవరపు బొర్రా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

కల్యాణం..కమనీయం

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెంలో వేంచేసియున్న అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి కల్యాణం వైభవంగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రికి స్వామి రథోత్సవం కనుల పండువగా సాగింది.



కల్యాణంనిర్వహిస్తున్న అర్చకులు



కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

పునుగోడు రిజర్వాయర్‌లో చేపల వేట

- సమస్య కోర్టులో ఉన్నా.. ధిక్కరించి చేపల పట్టివేత
- పట్టించుకోని మత్స్యశాఖ అధికారుల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదుకు సిద్ధం..

కనిగిరిరూరల్: కొంతకాలంగా పునుగోడు రిజర్వాయర్‌లో చేపల పట్టివేతపై వివాదం నడుస్తోంది. సమస్య కోర్టులో ఉన్నా.. అధికార పార్టీ అండతో కొందరు వ్యక్తులు పునుగోడు రిజర్వాయర్ చెరువులోని చేపలను శని, ఆదివారంలో పట్టారు. వివరాల్లోకి వెళితే..పునుగోడు రిజర్వాయర్‌లో గిరిజన జాలర్ల సహకార సంఘం సొసైటీ పేరుతో మత్స్య సంపదను సాగుచేసి పడతారు. అయితే సంపద పట్టివేతలో కొంత సమస్య రగులుతుంది. ఈక్రమంలో రిజర్వాయర్‌లో చేపల పట్టివేతకు మత్స్యశాఖ అధికారులు బహిరంగ వేలం పాట నిర్వహించి.. మమ అనిపించేలా చేశారు. దీనిపై గతంలోని పాత లీజుదారుడు కోర్టుకు వెళ్లాడు. మత్స్యశాఖ అధికారుల ఉద్దేశపూర్వకంగా తనను ఇబ్బంది పెట్టేందుకు అధికార పార్టీ ఒత్తిడితో హడావుడిగా వేలం పెట్టి తనకు లక్షల రూపాయలు నష్టం చేశారని ఆరోపిస్తూ కోర్టుకువెళ్లాడు. దీంతో సమస్య కోర్టులో నలుగుతోంది. ఈక్రమంలో టెండర్ దక్కించుకున్న అధికార పార్టీ సానుభూతిపరులు అక్రమంగా చేపలు పడుతున్నారంటూ పాత లీజుదారుడు లక్కిరెడ్డి హనుమారెడ్డి మత్స్య శాఖ అధికారులకు, ఇన్‌స్పెక్టర్‌కు శనివారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు వచ్చాయని మత్స్యశాఖ అధికారులకు తెలిపినా, వాట్సాప్ ద్వారా ఆర్డర్ కాపీని పెట్టినా.. ఫోన్‌లో చెప్పినా పట్టించుకోలేదని హనుమారెడ్డి వాపోయాడు. మత్స్యశాఖ నిర్లక్ష్యంపై కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ రామును వివరణ కోరగా తనకు ఉన్నాతాధికారుల నుంచి గాని, ఆర్డర్‌గాగానీ నేరుగా ఎటువంటి ఉత్వర్యులు రాలేదన్నారు. కోర్టు నుంచి ఏదైనా ఆదేశాలు వస్తే వాటిని అమలు చేస్తామని చెప్పారు.



పునుగోడు రిజర్వాయర్‌లో కొనసాగుతున్న చేపల వేట

శాఖాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పామూరులో శాఖాహార ర్యాలీ



యోగా శిక్షణలో పాల్గొన్న ఎంపీడీఓ రామాంజనేయులు

పామూరు: శాఖాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పిరమిడ్ ధ్యానకేంద్ర నిర్వాహకుడు గుత్తి రమణయ్య, పందిటి అల్లూరయ్య అన్నారు. స్థానిక పిరమిడ్ ధ్యానకేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం శాఖాహారం ఆవశ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పౌష్టిక విలువలతో కూడిన శాఖాహారమే ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమన్నారు. ర్యాలీలో సోమిశెట్టి మాల్యాద్రి, పి.తిరుపతిరెడ్డి, పలువురు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కొండపి: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ రామాంజనేయులు అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ బొమ్మ వద్ద యోగ శిక్షణ తరగతులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో చక్కటి ఆరోగ్యం, శరీర ధృఢత్వం లభిస్తుందన్నారు. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడి దూరమవుతాయన్నారు. నోడల్ ఆఫీసర్ అనూష, తహసీల్దార్ మురళి, ఆర్‌పీ అశోక్, సచివాలయ సిబ్బంది, యోగ శిక్షకుడు గుండా హరి, సత్యనారాయణ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి



కందుకూరులో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు



ఉలవపాడులో ఖోఖో ఆడుతున్న చిన్నారులు

కందుకూరు రూరల్: విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని గ్రంథపాలకురాలు పి.నాగరజిని అన్నారు. కందుకూరులోని శాఖా గ్రంథాలయంలో వేసవి తరగతులలో భాగంగా ఆదివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ వంటి పోటీల్లో విద్యార్థులు పాల్గొనడం వల్ల మీలో పోటీతత్వం పెరుగుతుందన్నారు. ఒక ప్రశ్నకు జవాబు ఎలా ఇవ్వాలనే ఆలోచన వంటివి మెరుగుపడతాయని చెప్పారు. విద్యార్థులు చదవడంతో పాటు చక్కటి చేతి రాతను కూడా నేర్చుకోవాలని చెప్పారు. చేతి రాత ఎంత బాగుంటే అంత మంచిదని చెప్పారు. కేవలం చదవడంపైనే ఆధారపడకుండా చేతి రాతను మార్చుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. వీటితోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను కూడా నేర్చుకోవాలని చెప్పారు. ఎవరితో ఎలా మాట్లాడాలి, బాషా ప్రావీణ్యం ఎలా ఉండాలనేది తెలుసుకోవాలన్నారు. ఎక్కువగా విద్యార్థులు కేవలం పాఠ్య పుస్తకాలకే అంకితం అవుతుంటారని చెప్పారు. అలా కాకుండా గ్రంథాలయాలకు వచ్చి ఇక్కడ అందుబాటులో ఉండే అన్ని రకాల పుస్తకాలను చదుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు.

విద్యార్థులకు ఖోఖో పోటీలు..

ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడులోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం ఖోఖో పోటీలు నిర్వహించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించినట్లు గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు తెలిపారు. మొత్తం 21 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నట్లు తెలిపారు. వచ్చే నెల 6 వ తేదీ వరకు ఈ వేసవి శిక్షణ శిబిరం జరుగుతుందని, విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు.



హైవేపై అందమైన మేఘాలు



ఆకాశమంతా మబ్బులు

కారుమబ్బులు కమ్మిన వేళ..

ఉలవపాడు: కారుమబ్బులు కమ్ముకున్నాయి.. ఆకాశం నల్లగా మారిపోయింది. సుందరమైన దృశ్యం ఆవిష్కృతమైంది. మేఘం కురిసింది..ఉలవపాడు తడిసింది. మండల పరిధిలో సాయంత్రం వేళ ఆకాశం నల్లటి మేఘాలతో కమ్ముకుని వర్షం పడింది. మండల పరిధిలో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు ఉపశమనం లభించింది. చల్లటి గాలులతో వాతావరణం చల్లగా మారిపోయి ఆహ్లాదకరంగా మారింది. కాని ఈ వర్షం వలన మామిడి కాయలలో పురుగులు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రజలు మాత్రం చల్లటి వాతావరణంతో ఆనందించారు.



ఉలవపాడులో కురుస్తున్న వర్షం

టంగుటూరులో కుండపోత వర్షం




టంగుటూరులో భారీ వర్షం

టంగుటూరు: టంగుటూరులో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. దీంతో రహదరులు జలమయ్యాయి. పోతల చెంచయ్య కాలనీలో ఇళ్లలోకి వర్షం నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే కొండపి ఫ్లై ఓవర్ నుంచి టంగుటూరు సెంటరు వరకు రోడ్డు గుంతలమయమై వర్షం నీరు చేరి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పిడుగుల పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఆంజనేయులు సూచించారు. మండలంలో ఎలాంటి పంటలు సాగులో లేవని, వర్షాలు అనంతరం రైతులు వేసవి దుక్కులు దున్నుకోవాలని వ్యవసాయాధికారి స్వర్ణలత పేర్కొన్నారు.

కనిగిరిరూరల్: కనిగిరిలో ఆదివారం రాత్రి చిరుజల్లులతో కూడిన వాన కురిసింది. రాత్రి 7.30 గంటల నుంచి 10.30 గంటల వరకు నాన్చుడు వాన కురుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు పట్టణంలోని పలు వార్డుల్లో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దీంతో పట్టణ ప్రజల అవస్థలు వర్ణణాతీతంగా మారాయి.

ప్రభుత్వాల విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కొండారెడ్డి

కొండపి: వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేలా మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, సమరశీల ఉద్యమాలతో ప్రతిఘటించాలనీ సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జీవీ కొండారెడ్డి అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి వార్షోత్సవాల్లో భాగంగా పెరిదేపి సచివాలయం సెంటర్‌లో కోలాటం, కళారూపాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్య త్యాగపూరితమైన, ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారన్నారు. మోడీ ప్రభుత్వం తెస్తున్న జాతీయ నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానం ద్వారా వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలని 13 నెలలకు పైగా ఢిల్లీ నడ్డిబొడ్డున రైతులు చేసిన పోరాటానికి చట్టాలను వెనక్కి తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కానీ నేడు మళ్లీ ఆ చట్టాలను దొడ్డిదారిన తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యుడు కేజీ మస్తాన్, సీపీఎం మండల కార్యదర్శి మల్లెల కొండయ్య, నాయకులు అంగలకుర్తి చిన్నబ్రహ్మయ్య, మల్లెల చిన్న పేతురు, ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య, గుమ్మల్ల వెంకటేశ్వర్లు, ఎం.పెద్ద పేతురు తదితరులు పాల్గొన్నారు.